క్లుప్తంగా

శివలింగానికి క్షీరాభిషేకం



ఏటూరునాగారం: కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమ వారం ఉదయం శివలింగానికి క్షీరాభిషేకం , పంచామృత అభిషేకాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అర్చకులు రాజ్‌కుమార్ ఆలయానికి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అర్చనలు, తీర్థప్రసాదాలను అందజేశారు. మహిళలు ఉసిరి, ద్వజస్తంభం చుట్టూ నెయ్యి దీపాలను వెలగించారు.

ఆస్పత్రి తనిఖీ



వాజేడు: వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ అడిషనల్ డీఎమ్‌హెచ్‌ఓ క్రాంతి కుమార్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సాయంత్రం సమయంలో ఎంత మంది సిబ్బంది ఉన్నది అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రోజు వారీగా ఆస్పత్రికి ఎంత మంది రోగులు వస్తున్నది డాక్టర్ మహేందర్‌ను అడిగి పలు సూచనలను చేశారు. అలాగే రోగులను పరీక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



గోవిందరావుపేట: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పస్రా ఎస్సై కమలాకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై కొనుగోలు కేంద్రం నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

పెరిగిన చలి



వాజేడు: మండలంలో రెండు రోజులుగా చలి తీవ్రత పెరుగింది. ప్రజలు ఉదయం పూట చలికి తట్టుకోలేక చలి మంటలను వేసుకున్నారు. చలి పెరుగడంతో మిరుప తోటలు ఏపుగా పెరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

వాజేడు: తాము సాగు చేసుకున్న పంటల వద్దకు వెళ్లడానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తోలెం ముత్తయ్య తెలిపారు. మండల పరిధిలోని వాజేడు నుంచి గుమ్మడిదొడ్డికి వెళ్లే మార్గంలో కొంగాల వాగు సమీపం వద్ద ఉన్న పాత రహదారి అన్యాక్రాంతం అయిందని ఆరోపించారు. అన్యాక్రాంతం రహదారిని సర్వే చేసి వాజేడు, గుమ్మడిదొడ్డి రహదారి దగ్గర నుంచి లోపలి చేన్లకు వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేయించాలని విన్నవించుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక సాయం



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన కొడెల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మున్నూరుకాపు సంఘం నాయకులు రూ.6వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల రవీందర్, ఆదిరెడ్డి, ర్యాకం రవీందర్, ఆకుల రాజు, తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



జమాల్‌బీ(ఫైల్)

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లికి చెందిన 108 సంవత్సరాల వృద్ధురాలు ఎస్‌కే.జమాల్‌బీ సోమవారం మృతి చెందారు. కాగా భర్త 40ఏళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఐదుగురు కొడుకులు, ఒక కుమార్తెలోతో పాటు కోడళ్లు, మనవలు, మనువరాళ్లు కలిపి 130మంది ఉన్నారు. 108 ఏళ్ల వయస్సు ఉన్నప్పటికీ బీపీ, షుగర్ లాంటి వ్యాధులు లేవు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం

- దెబ్బతింటున్న రహదారి
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: మండల కేంద్రం నుంచి చిట్యాల మండలంలోని నవాబుపేట వరకు సుమారు రూ.3కోట్ల నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఇటీవల ప్రారంభించారు. ఇంకా రోడ్డు నిర్మాణం కూడా పూర్తి కాకముందే సుబ్బక్కపల్లి కల్వర్టు వద్ద ధ్వంసం అవుతుంది. ఓ పక్క రోడ్డు నిర్మాణమే పూర్తి కాలేదు, మరో పక్క రోడ్డు ధ్వంసం కావడంపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పలువురు వాపోతున్నారు. కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్డు నాసిరకంగా నిర్మిస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి పరకాలకు వెళ్లే వాహనదారులు నిత్యం ఈ రోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారని, అలాంటి రోడ్డు నాసిరకంగా నిర్మిస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు నాణ్యతగా నిర్మించేలా కృషి చేయాలని కోరుతున్నారు.



దెబ్బతిన్న నూతనంగా నిర్మిస్తున్న తారు రోడ్డు

ముగిసిన సమగ్ర కుటుంబ సర్వే



ఏటూరునాగారం: సర్వే చేస్తున్న అధికారులు



వాజేడు: సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: ఈనెల 9న మొదలైన సమగ్ర ఇంటింటి సర్వే సోమవారంతో ముగిసింది. మండలంలోని 12 గ్రామ పంచాయతీల వారీగా సర్వేను 61 మంది ఎన్యూమేటర్లు, 12 మంది సూపర్‌వైజర్లతో కూడిన బృందం నిర్విరామంగా సర్వే చేపట్టింది. మండలంలో 9379 కుటుంబాలు ఉండగా వాటిని నూటికి నూరుశాతం పూర్తి చేసినట్లు ఎంపీఓ కుమార్ తెలిపారు. అయితే అదనం మరో 250 కుటుంబాలు ఉండగా వాటిని సోమవారం సర్వే చేయించామన్నారు. ప్రజలు సహకరించడం వల్ల సర్వే విజయవంతం అయిందన్నారు. అలాగే ఏ రోజు సర్వేను ఆ రోజు ఆన్‌లైన్ కూడా చేసినట్లు తెలిపారు.

47 ఇళ్లు సర్వే చేస్తే వంద శాతం పూర్తి

వాజేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలో మరో 47 ఇళ్లు చేస్తే వంద శాతం పూర్తి అవుతుంది. స్టిక్కరింగ్ ప్రకారం వంద శాతం ఇప్పటికే పూర్తి అయినప్పటికీ పెరిగిన ఇళ్ల ప్రకారం కొంత పెండింగ్ ఉంది. మంగళవారంతో వంద శాతం పూర్తి కానుందని అధికారులు తెలిపారు. మండలాన్ని 102 బ్లాకులుగా విభజించి శరవేగంగా సర్వే చేపట్టారు. 66 మంది ఎన్యునరేటర్లు సూపర్ వైజర్ల పర్యవేక్షణలో కుటుంబాల ఆర్థిక, విద్య ఉపాధి పలు వివరాలను నమోదు చేసి సర్వేను విజయవంతం చేశారు.

‘హామీలను విస్మరించిన ప్రభుత్వాలు’

వెంకటాపురం(కె): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవి కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టులే అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో వ్యతిరేకత మొదలయిందని ప్రజలే స్వచ్ఛందంగా పోరాటాలు చేసేందుకు ముందుకు వచ్చే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. అనంతరం సీపీఎం పార్టీ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గ్యానం వాసును, మరో 23 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు రెడ్డి సాంబశివ, రాజేందర్, చిట్టిబాబు, మల్లరెడ్డి, రఘుపతి, కుమ్మరి శ్రీను, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రవి కుమార్

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదిక కార్యక్రమంలో అధికారులు

వెంకటాపురం(కె): మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 18 పంచాయతీల్లో నిర్వహించిన పనులపై ప్రిసైడింగ్ అధికారి మెరుగు వెంకటనారాయణ, ప్లాంటేషన్ మేనేజర్ కిషోర్ కుమార్, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ , ఏపీఓ భవాని, ఎస్ఆర్‌పీ చెన్న కేశవులు సమక్షంలో పంచాయతీల్లో చేపట్టిన పనులపై వివరించారు. కాగా, రూ.37 వేల నగదును వివిధ పనుల్లో రికవరీ చేయాలని ఉపాధిహామీ సిబ్బంది, ఏపీఓను అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గిరిజన నాయకులను విడుదల చేయాలి

గోవిందరావుపేట: లగచర్ల ఘటనలో గిరిజన రైతులకు అండగా నిలబడి పోరాటం చేస్తున్న గిరిజన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు లకావత్ నరసింహానాయక్ అన్నారు. లగచర్ల రైతులకు అండగా గిరిజన నాయకులు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని గిరిజన నాయకులను పస్రా పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా గిరిజన నాయకుల, కార్యకర్తల అరెస్ట్‌లను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు వాంకుడోత్ రాజు, బాండవత్ తిరుపతి, మాలోత్ రవికుమార్, అజ్మీరా సురేష్, లకావత్ చంద్‌లాల్, పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు

దయనీయంగా నేతకాని బతుకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: నేతకానిల బతుకులు దయనీయంగా ఉన్నాయని తెలంగాణ నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కావేరి చిన్ని కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. నేతకాని కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. గోదావరికి ఇరువైపులా సీళ్లనే ఆధారం చేసుకుని గుడిసెలు నిర్మించుకొని అడవి ఉత్పత్తులపై ఆధారపడి వనం కొనసాగిస్తున్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో పూర్వం నుంచి ఏజెన్సీ ప్రాంతంలో జీవిస్తూ వ్యవసాయ కూలీలుగా మారి పోడు చేసుకున్న భూములకు పట్టా లేక విద్యా, ఉద్యోగ ఉపాధి లేక రోజు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దిగుండా నరసింహరావు, ప్రధాన కార్యదర్శి కొండగుర్ల పోశయ్య, యువజన నాయకులు కుమ్మరి చంద్రబాబు, మాజీ ఎంపీటీసీ కావేరి సమ్మయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం

కాటారం: మండలంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సీసీ కెమెరాల కోసం మండలంలోని అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రానికి చెందిన కొట్టె ప్రభాకర్ సోమవారం రూ.10000ల విలవ గల చెక్కును ఎస్సై మ్యాక అభినవ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొట్టె శ్రీహరి, రాజు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ప్రభాకర్

కాళేశ్వరంలో మద్యం దుకాణం బంద్

కాళేశ్వరం: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గడ్చిరోలి జిల్లాకు గోదావరి సరిహద్దు గ్రామాల్లోని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని రెండు మద్యం దుకాణాలను ఎక్సైజ్ పోలీసులు సోమవారం మధ్యాహ్నం బంద్ చేశారు. మళ్లీ 20న పోలీంగ్ ముగిసిన తరువాత తెరువనున్నారు. 48గంటల పాటు సరిహద్దు మద్యం దుకాణం కావడంతో బంద్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. దీంతో బెల్టుదుకాణాల్లోకి మద్యం జోరుగా చేరింది. అధికారులు అటువైపు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పలువురికి గాయాలు

రేగొండ: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలకు చెందిన సదానందం, రాజు ద్విచక్రవాహనంపై చెల్పూర్‌కు వెళ్లుతుండగా, భూపాలపల్లి నుంచి పరకాలకు వెళ్తున్న ఆటో అదుపుతప్పి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్ మీద వస్తున్న సదానందం, రాజుతో పాటు ఆటో డ్రైవర్ గాయపడ్డారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో వాహనం నడిపిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి లావుడ్య జయపాల్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు, సైన్స్ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు, యువతి యువకులకు వ్యాసరచన పోటీలు, నృత్య పోటీలు, సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తాము ఎంచుకున్న గమ్యం చేరేంతవరకు ప్రత్యేక శ్రద్ధతో చదవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి సెలవులలో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను కల్పించి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సర్వాంగ సుందరంగా తయారు చేశామన్నారు. విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను మరిపించే విధంగా అన్ని హంగులాలతో ఘనపురం మండలంలోని గాంధీనగర్‌లో ఎడ్యుకేషన్ హబ్‌ను నిర్మించబోతున్నామన్నారు. అదేవిధంగా వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు మెస్ చార్జీలు సైతం పెంచామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రధాన ఆస్పత్రులలో అన్ని విభాగాలకు డాక్టర్లు నియమించామన్నారు. అనంతరం ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి స్వామి, ఎస్‌జీఎఫ్ క్రీడల జిల్లా కార్యదర్శి రమేష్, 16వ వార్డ్ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, జిల్లాలోని పీఈటీలు సాంబమూర్తి, రాజయ్య, యువజన శాఖ ప్రత్యేక అధికారి అన్వేష్, డివైఎస్‌ఓ కార్యాలయ సిబ్బంది శివసాగర్ పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్: యువజనోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

యువజన ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

కాటారం: జిల్లా కేంద్రంలో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గెలుపొందిన విద్యార్థులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను గైడ్‌టీచర్ రాజును హెచ్‌ఎం ఉమారాణి, వసతి గృహం వార్డెన్ భవాని, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



కాటారం: విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఆదర్శ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో మండల కేంద్రానికి చెందిన ఆదర్శ హై స్కూల్ విద్యార్థులు గ్రూప్ డ్యాన్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దీతో విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, తదితరులు అభినందించారు.

రశీదులు తీసుకోవాలి



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీఏఓ

వాజేడు: ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన సమయంలో రైతులు బిల్లుల రశీదులను తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిని తేజోవతి అన్నారు. మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపులను ఆమె తనిఖీ చేశారు. రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను పరిశీలించి పలు సూచనలను చేశారు. ఈ పాస్ మిషన్లో నమోదు చేయకుండా ఎరువుల బస్తాలను విక్రయించవద్దని డీలర్లకు సూచించారు. ఏఓ ముంజ మహేష్, ఏఈఓలు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యాన్ని చూపుతున్న అధికారులు

రేగొండ: రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం సోమవారం చేసుకున్నారు. మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో విజిలెన్స్ సీఐ అనిల్, రెవెన్యూ సిబ్బందితో కలిసి రైస్‌మిల్లుపై దాడి చేశారు. 51 రైస్ బ్యాగుల్లో నిల్వ చేసిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 7 క్వింటాళ్ల పరం (నూకలు)ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రైస్ మిల్లు నిర్వహకుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్హర్: తాడిచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వల్లెకుంట, కొయ్యూరు, ఎడ్లపల్లి, చిగురుపల్లి, పాత రుద్రారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్యాడి క్లీనర్లు, ఇతర పద్ధతుల ద్వారా తూర్పల చేసిన తర్వాత తేమ శాతం 17 మించకుండా వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అనుసందానం చేసుకుంటేనే కొనుగోలు చేయడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శనిగరం రమేశ్, సిద్ది లింగమూర్తి, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, పీఏసీఎస్ డైరెక్టర్ సంగెం రమేశ్, ఎడ్ల నారాయణ, కటకం శ్రీనివాస్ మండల వ్యవసాయ అధికారి శ్రీజ, ఏఈఓ అనుష, అయిత రాజిరెడ్డి, బడితల రాజయ్య, కొండ రాజమ్మ, జంగిడి శ్రీనివాస్, ఆయూబ్ ఖాన్, రైతులు, హమాలీలు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మొండయ్య

హత్య కుట్రపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాటారం: మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును హత్య చేయాలని గతంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు తనను ప్రేరేపించారని బీజేపీ నాయకుడు చల్ల నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకొని విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, యూత్ నాయకుడు జక్కు శ్రావణ్ మాట్లాడారు. నారాయణరెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు శ్రీధర్‌బాబు. శ్రీనుబాబు తన ద్వారా మధు హత్యకు పథకం రచించారని నారాయణరెడ్డి సోషల్‌మీడియాలో స్వయంగా వీడియో పోస్టు చేశారని తెలిపారు. శ్రీధర్‌బాబు తన రాజకీయ భవిష్యత్‌కు అడ్డుపడుతున్న పుట్ట మధును తొలిగించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూవస్తున్నారని ఆరోపించారు. పుట్ట మధు అనేకమార్లు తనకు ప్రాణహాని ఉందని ప్రజల ముందు వెల్లడించారని ఈ తరుణంలో ప్రభుత్వం ఆయన గన్‌మెన్లను తొలిగించడం కుట్రలో భాగమే అని పేర్కొన్నారు. పుట్ట మధుకు ఎలాంటి హాని జరిగిన ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పుట్ట మధు భద్రతపై కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు మండల లక్ష్మారెడ్డి, నాయకులు గాలి సదవలి, నరివెద్ది శ్రీనివాస్, ఉప్పు సంతోష్, జాగరి మహేశ్, రామిళ్ల రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

టేకుమట్ల: వరి కోతలు మొదలైనా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ కార్మిక శాఖ మండల అధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంతో పాటు మండలంలోని పంగిడిపల్లి, వెల్లంపల్లి, బూర్నపల్లి, రాఘవరెడ్డిపేట, ఎంపేడులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు రోడ్ల వెంట ధాన్యాన్ని ఆరబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు రైతుల కష్టాలు ఇలా ఉంటే రాత్రి వేళల్లో ప్రమాణించే వాహనదారుల పరిస్థితి మరోలా ఉందన్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులకు రైతులు ఆరబోసిన ధాన్యం కుప్పలు ప్రాణసంకటంగా మారయన్నారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.